క్లుప్తంగా

అందరి జీవితాల్లో సంతోషం నిండాలి


ఆదిమూలం, ఎమ్మెల్యే

వరదయ్యపాళెం: సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆకాంక్షించారు. శనివారం ఆయన నియోజకవర్గ ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరి జీవితంలో భోగభాగ్యాలు కలగాలని, సంతోషాన్ని నింపాలని ఆకాంక్షించారు.

దుస్తుల పంపిణీ



నారాయణవనం: నారాయణవనం మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శనివారం సర్పంచ్ శారదా గణేషన్ యూనిఫాం అందజేశారు. సంక్రాంతి సందర్భంగా పంచాయతీలో పనిచేస్తున్న 18 మంది పంపు ఆపరేటర్లకు, పారిశుద్ధ్య కార్మికులకు తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు.

ప్రభుత్వ బడుల్లో సాంకేతిక విద్య


ట్యాబ్‌లను అందజేస్తున్న హెచ్‌ఎం

బుచ్చినాయుడుకండ్రిగ: కాలానుకనుగుణంగా సాంకేతిక విద్యా బోధన అందించేందుకే విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేస్తోందని హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా రాణించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులతో షికారీలు

ఏర్పేడు: మండలంలోని చింతలపాలెం పంచాయతీలోని మరాఠీపురం, చింతలపాలెం ఎస్టీ కాలనీలలో 130 కుటుంబాలకు ప్రజాసాధికారిక సమితి ఆధ్వర్యం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. సమితి కార్యదర్శి దేవేంద్ర మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా తమ సంస్థ తరపున నిత్యావసర సరకులు అందజేస్తున్నట్లు వివరించారు. ఎస్టీ కాలనీల్లో అవగాహనాలేమితో బాల్యవివాహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, షికారీల సంఘం నాయకుడు పరశునాథ్ పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



ఏర్పేడు: సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య ఆధ్వర్యంలో శనివారం పోలీస్ స్టేషన్, కొబాక ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదలు, చెత్తచెదారాలను తొలగించారు. రోడ్డు పక్కన ముళ్లపొదలు దట్టంగా ఉండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వాహనదారుల విన్నపం మేరకు ముళ్ల పొదలను తొలగించారు.

28న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

పుంగనూరు : తిరుపతి పట్టణంలోని ఇస్కాన్ మందిరం రోడ్డులో ఉన్న కంచి కామకోటి పాదుకా మఠంలో ఈ నెల 28న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు బ్రాహ్మణ సంఘం నాయకులు శేషగిరిరావు, కాసలనాటి రామమూర్తి తెలిపారు. వారు శనివారం పుంగనూరులో పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ గాయిత్రీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 32వ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ వధూవరులు తమ పూర్తి వివరాలతో పరిచయ వేదికలో పాల్గొనవచ్చని వారు కోరారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు మధు, కృష్ణమూర్తి, గిరి, శ్రీనివాసరావు, రమణరావు, అశ్వర్థనారాయణ, మల్లికార్జున, ప్రణీత్, రాజేష్, మహేష్, పవన్, విహారి, వినోద్‌అర్ష తదితరులు పాల్గొన్నారు.

మది నిండుగా.. సంక్రాంతి పండుగ


వరదయ్యపాళెం: డూడూ బసవన్నలు, భోగి కంపను తరలిస్తున్న చిన్నారులు



శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో సంక్రాంతి సంబరాలు శనివారమే ప్రారంభమయ్యాయి. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే పెద్ద పండుగ కోలాహలం కనిపించింది. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. వస్త్రాలు, పండుగ సామగ్రి కొనుగోలుకు వచ్చిన జనంతో శ్రీకాళహస్తి, సత్యవేడు, వరదయ్యపాలెం, పిచ్చాటూరు పట్టణాలు కిక్కిరిశాయి. రాత్రి 11 గంటల వరకు దుకాణాలు రద్దీగా కనిపించాయి. యువకులు ఆదివారం నాటి భోగికి సామగ్రి సిద్ధం చేయగా.. అర్ధరాత్రి దాటగానే మహిళలు ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దారు.

– శ్రీకాళహస్తి/వరదయ్యపాళెం


శ్రీకాళహస్తి: వస్త్ర దుకాణంలో కొనుగోలుదారుల రద్దీ




శ్రీకాళహస్తి పట్టణంలో శనివారం వివిధ దుకాణాల వద్ద సందడే సందడి

ఎస్టీలకు ఇంటి పట్టాల పంపిణీ


పట్టాలను పంపిణీ చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: తొట్టంబేడు మండలం కాసరం ఎస్టీ కాలనీ వాసులకు శనివారం ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. శ్రీకాళహస్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గత దశాబ్దకాలంగా ఇంటి పట్టాలు లేకుండా అవస్థలు పడుతున్న 11 కుటుంబాల వారికి పార్టీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అందజేశారు.లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమకు పట్టాలు ఇప్పించాలని పలువురు నాయకులు, అధికారులకు మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇటీవల ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన వెంటనే పట్టాలు మంజూరు చేయించినట్లు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు తాము రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు శంకరయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీబాబురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గురుమూర్తి, పాండు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలానికి సన్మానం


ఆదిమూలంను సన్మానిస్తున్న నాగలాపురం నాయకులు

నాగలాపురం: సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలంను వైఎస్సార్ సీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రకటించిన సందర్భంగా పార్టీ నాగలాపురం నాయకులు ఆయనను సన్మానించారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని గజమాలతో సత్కరించి, శాలువ కప్పి అభినందనలు తెలిపి, ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు అపరంజి రాజు, సర్పంచ్ చిన్నదురై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌ఎం సురేష్, నాయకులు హరిబాబు, దేశప్పన్, చిరంజీవి, ధనరాజ్, కులశేఖర్ రెడ్డి, ముత్తు పాల్గొన్నారు.

పలు గ్రామాలకు వీధిలైట్ల వితరణ


వీధిలైట్లను అందజేస్తున్న ఢిల్లీబాబురెడ్డి

రేణిగుంట: తొట్టంబేడు మండలంలోని పలు గ్రామాలకు వైఎస్సార్‌సీపీ సేవాదళ్ ఆధ్వర్యంలో శనివారం వీధిలైట్లను వితరణగా అందించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల నేపథ్యంలో కాసరం పంచాయతీ పరిధిలోని కాసరం, కొండ్రాజుపల్లి, గొట్టిపూడి, రాంబట్లపల్లెలో వీధిదీపాలు లేకపోవడంతో ప్రజలు రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని గ్రామస్తులు వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఢిల్లీబాబు రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సొంత నిధులు రూ.60 వేలు వెచ్చించి వీధిలైట్లను తెప్పించి వితరణగా అందజేశారు.గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రపర్వంగా ఆండాళ్ నీరాటోత్సవాలు



నీరాటోత్సవంలో ఆండాళ్ అమ్మవారు, ఊరేగింపులో ఉభయ దేవేరులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ నీరాటోత్సవాల చివరి రోజైన శనివారం ఉదయం ఆండాళ్ అమ్మవారు, శవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై తిరు వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున 4 గంటలకు తిరుప్పావై ప్రవచనాలతో ఆలయాన్ని తెరచి నిత్యపూజ, ధనుర్మాస పూజా కైంకర్యాలను పూర్తి చేశారు. ఆరు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆండాళ్ నీరాటోత్స వాల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజల అనంతరం తిరుచ్చి వాహనం కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. కాగా, శ్రీవేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణం సందర్భంగా సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఉభయదేవేరుల సమేతంగా స్వామివారు తిరుచ్చి వాహనం అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణం చేశారు. ఆలయ అధికారి నాగరాజు, భరత్, షనాయి, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు. ఈనెల 16వ తేదీ మంగళవారం ఆలయంలో గోదా కల్యాణం అనంతరం ఆండాల్, కల్యాణ వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం ఉంటుందని ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు.

హోరాహోరీగా ఆడుదాం-ఆంధ్రా


బత్తెయ్య

కేవీబీపురం: ఆడుదాం-ఆంధ్రాలో భాగంగా శనివారం జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో కళత్తూరు, పెరిందేశం సచివాలయాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. కళత్తూరు జట్టు విజయం సాధించింది. పెరిందేశం జట్టు కెప్టెన్ బత్తెయ్య 30 బంతుల్లో హాఫ్ సెంచరీ(53)చేసి అద్భుతమైన బ్యాటింగ్ తీరును కనబరిచాడు. లక్ష్యఛేదనలో కళత్తూరు జట్టు దీటుగా బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను టైగా మార్చింది. సూపర్ ఓవర్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కళత్తూరు జట్టు 5 పరుగులు మాత్రమే చేసింది. 6 పరుగుల లక్ష్యాన్ని పెరిందేశం జట్టు రెండు బంతుల్లో ఒక సింగిల్, ఒక సిక్స్‌తో గెలుపొందింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా బత్తెయ్య నిలిచాడు.

డ్రైవర్‌పై కేసు నమోదు

ఏర్పేడు: అతివేగంగా వాహనాన్ని నడిపి కారును ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శనివారం రాత్రి తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. మండలంలోని బాలకృష్ణాపురం రైల్వే గేటు వద్ద ఈ నెల 6న తిరుపతి నుంచి వెంకటగిరికి వెళుతున్న అశోక్ లైలాండ్ వాహనం అతి వేగంతో ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం డ్రైవర్ వంశీపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయంలో మంచు విష్ణు

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. బీజేపీ తెలంగాణ ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మురగనందన్, ప్రముఖ హీరో మంచు విష్ణు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

స్వర్ణ తిరుచ్చిపై కల్యాణ వెంకన్న సాక్షాత్కారం



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు సాక్షాత్కరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవ నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆసీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో అంబరాన్నింటిన సంబరాలు


రంగవల్లులు తీర్చిదిద్దుతున్న యువతులు, పూజల్లో ఎండీ రవీంద్ర సన్నారెడ్డి


ఆరూరు మహిళల కోలాటం

సత్యవేడు: శ్రీసిటీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం ముగ్గు పోటీలు, కోలాటం తదితర కార్యాక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో శ్రీసిటీలోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు, సరిసర గ్రామాల మహిళలు పాల్గొన్నారు. ఆరూరు గ్రామస్తుల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి కోలాహలం కన్నులకు కట్టింది. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, ముఖ్య అతిథులుగా విచ్చేసిన అడిషనల్ డీజీపీ అతుల్ సింగ్, ఆయన భార్య ప్రియాసింగ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తెలుగు ప్రజలు ఎంతో ఇష్టంగా జరుపుకునే పెద్ద పండుగను పురస్కరించుకుని శ్రీసిటీలో ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి అన్నారు. సిబ్బంది, శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులు, శ్రీసిటీ గ్రామాల ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచిన కీర్తన, నిషా, పూర్ణిమకు ప్రియాసింగ్ నగదు బహుమతులు అందజేశారు.

వైభవం.. గొబ్బిదేవత ఉత్సవం



పురవీధుల్లో గొబ్బి దేవత ఊరేగింపు, ప్రత్యేకాలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం గొబ్బిదేవత ఉత్సవం వేడుకగా జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో గొబ్బెమ్మ ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ గొబ్బి దేవతను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం శ్రీశనీశ్వర స్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం,పవిత్ర కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: కసిమ్మిట్టకు చెందిన గుణశేఖర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన రూ.3లక్షల చెక్కును శనివారం ఎమ్మెల్యే ఆదిమూలం అందజేశారు. రెండు నెలల కిందట వివాహ వేడుకలో కంప్రెజర్ సిలిండర్ పేలడంతో మీనాక్షి, గుణశేఖర్‌ల కుమార్తె(16) చాందిని మృతి చెందింది. ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ 3 లక్షలు మంజూరైంది. నారాయణవనంలో జరిగిన ఒక కార్యక్రమంలో చెక్కును గుణశేఖర్‌కు ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు రాజారెడ్డి, అయ్యప్ప, ఆర్మొగం, చీరాలయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మోహన్


తిరుపతి కల్చరల్: చెన్నై శంకర నేత్రాలయ సౌజన్యంతో ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు వారం రోజులపాటు తొండవాడ గ్రామంలోని సచివాలయంలో పేదలకు ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ మోహన్ మల్లం తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్ల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో ప్రత్యేక థియేటర్ సౌలభ్యం కలిగిన రెండు బస్సుల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగంతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 22 మంది వైద్య బృందం ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 94400 77932, 98483 15857 సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

నేడు గోవిందరాజస్వామి భోగి తేరు

తిరుపతి కల్చరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో భోగి పండుగ సందర్భంగా ఆదివారం భోగి తేరు ఊరేగింపు వేడుకగా నిర్వహించనున్నారు. అలాగే సోమవారం ఆలయంలో మకర సంక్రాంతి వేడుకలు జరుగనున్నాయి. భోగి పండుగ నాడు సాయంత్రం 5.30 నుంచి రాత్రి గంటల వరకు శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణ స్వామివారిని భోగి తేరుపై కొలువుదీర్చి ఊరేగింపు చేపడుతారు. సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా ఉదయం తిరుమంజనం నిర్వహిస్తారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు


కరకంబట్టులో అక్షింతల పంపిణీ


ఏర్పేడులో ..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు, గాజులపెళ్లూరు, కరకంబట్టు పంచాయతీల్లో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాంలాల పూజిత అక్షింతలను శనివారం ధర్మప్రచార పరిషత్ సభ్యులు ఇంటింటికీ పంపిణీ చేశారు. పదిరోజుల పాటు స్థానిక ఆలయాల్లో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో అక్షింతలను ఉరేగించారు. అక్షింతల ప్రాధాన్యాన్ని వివరించారు.

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తిలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు, విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ప్రజలకు ఆయోధ్య శ్రీరాముని పూజిత పవిత్ర అక్షింతలను పంపిణీ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ చైర్మన్ కోలా ఆనంద్, స్వర్ణమూర్తి, కంఠా ఉదయ్‌కుమార్, కుమారస్వామి, గరికపాటి రమేష్, కార్తికేయన్, అమర్‌నాథ్, సూర్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండల కేంద్రంలోని రామాలయంలో శనివారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో అయోధ్య పవిత్ర అక్షింతల పంపిణీ జరిగింది. అక్షింతలు వృద్ధి చేసుకునే కార్యక్రమం, అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం రోజు చేపట్టాల్సిన పూజా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అయోధ్య అక్షింతల కమిటీ కన్వీనర్ శంకర్‌రెడ్డి, ప్రసన్న, కాటయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.